



# నవభూమి
## కరీంనగర్ అనుబంధం
28 మే,2025 బుధవారం పేజీలు:5
www.epaper.navabhoomi.in


### ఇన్‌చార్జి మంత్రి
# ఉన్నట్టా.. లేనట్టా..?



**కరీంనగర్-నవభూమి:** ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో నిత్య చైతన్యంగా ఉండే కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులు, శ్రేణులు నిరాశ, నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఇంతకు ఇక్కడ తమ పార్టీ అధికారంలోనే ఉందా.. ఇన్‌చార్జి మంత్రి ఉన్నట్టా.. లేనట్టా.. ఉంటే నెలలు గడిచినా ఆయన జిల్లాకు ఎందుకు రాడు, జిల్లా కేంద్రానికి కీలకంగా ఉండే కరీంనగర్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లు ఎందుకు మంజూరు కావడం లేదు.. అసలు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలే ఎందుకు ఏర్పాటు కావడం లేదు అంటూ ప్రశ్నలు సంధిస్తున్నారు. ఏడాదిన్నరగా ఒక్కటే సమీక్షా సమావేశం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఇన్‌చార్జి మంత్రిగా నియమించారు. ఏడాదిన్నర గడిచినా ఆయన ఒకే ఒక సమీక్షా సమావేశంతో సరిపెట్టుకున్నారు. ఆ సమావేశం కూడా రసాభాసాగా మారడంతో మళ్లీ ఆయన జిల్లాలో సమావేశం ఏర్పాటుకే ముందుకు రావడం లేదు అనే మాట వినిపిస్తున్నది. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర మంత్రివర్గంలో డి శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిద్దరి మధ్య ఆధిపత్య పోరో మరేమోగాని సఖ్యత లేకుండా పోయింది. ఒకరంటే ఒకరికి పడదు. ఒకరుంటే ఒకరు రారు. వీరిద్దరిలో ఎవరి వద్దకు వెళ్లాలన్నా ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఒకటికి పదిసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి. ఎవరి వద్దకు వెళితే వారి ముద్ర పడిపోతుందేమోననే భయంతో కార్యకర్తలు ఎటూ వెళ్లలేకపోతున్నారు. జిల్లాకు వచ్చిందే మూడుసార్లు ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఏడాదిన్నర కాలంలో మూడుసార్లు మాత్రమే జిల్లాకు వచ్చారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ పథకాల అమలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాల సమీక్ష కోసం ఏర్పాటు చేసిన సమావేశం రసాభాసగా ముగిసింది. అధికార, ప్రతిపక్షాల ఎమ్మెల్యేలు ఒకరినొకరు తోసేసుకునే పరిస్థితి వరకు వెళ్లింది. కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు మైక్ ఇవ్వవద్దని, ఆయన ఏ పార్టీనో చెప్పాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి అడ్డుకుని ప్రశ్నించడమే కాకుండా ఆయనపై దాడి చేసినంత పనిచేశారు. అదే స్థాయిలో సంజయ్‌కుమార్ కూడా తీవ్ర పదజాలంతో జవాబిచ్చారు. పోలీసులు కౌశిక్‌రెడ్డిని బయటకు పంపించాల్సి వచ్చింది. దీని తర్వాత ఉత్తమ్ కుమార్ రెడ్డి మళ్లీ సమావేశం ఏర్పాటు చేసి జిల్లా అభివృద్ధి కార్యక్రమాల సమీక్షను నిర్వహించలేదు. హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి సోదరుని వరుస కావడంతో సమావేశంలో జరిగిన వ్యవహారంతో ఆయన తీవ్ర అసంతృప్తికి, అసహనానికి గురై ఆ తర్వాత సమావేశం ఏర్పాటుకే ఆసక్తి చూపించలేదనే అభిప్రాయం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉంది. నియోజకవర్గంలో ఆధిపత్య పోరు కరీంనగర్ నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితి ఆయనకు మింగుడు పడడం లేదని తెలుస్తున్నది. కరీంనగర్ నియోజకవర్గ కేంద్రంగా జరుగుతున్న రాజకీయాలు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రుల మధ్య ఆధిపత్య పోరుగా మారుతున్నాయనే అభిప్రాయం ఉన్నది. మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో కరీంనగర్ అసెంబ్లీకి, పార్లమెంట్ స్థానానికి పోటీచేసి ఒకసారి ఎంపీగా గెలుపొందారు. ఆయన ఈ అసెంబ్లీ నియోజకవర్గాన్ని వదిలి హుస్నాబాద్ నుంచి పోటీ చేసి గెలిచారు. ఆ నియోజకవర్గం సిద్దిపేట జిల్లాలో ఉన్నా దాని పరిధిలోని రెండు మండలాలు కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. ఆయన కరీంనగర్‌కు చెందిన వారు. ఇక్కడి రాజకీయాలతో బలమైన సంబంధాలు ఉన్నారు. ఈ జిల్లా నుంచి మంత్రిగా వేరెవరికి అవకాశం కల్పించకపోవడంతో తాను ఆ బాధ్యతను నిర్వహించడానికి ఆసక్తి చూపిస్తూ అన్ని కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. ఆయనకు సంబంధం లేకుండానే సుడా చైర్మన్‌గా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిని, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా సత్తు మల్లేశంను నియమించారు. వీరిద్దరూ ఒకరు మంత్రి శ్రీధర్‌బాబు వర్గానికి చెందినవారుకాగా, మరొకరు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సన్నిహితుడు. వీరిద్దరిని పదవీ బాధ్యతలు చేపట్టే విషయంలో కూడా మంత్రి పొన్నం ససేమిరా అన్నా వారు ఆయా చైర్లలో కూర్చున్నారు. మరోవైపు తాను సపోర్టు చేసిన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ తనకు ఎదురు తిరిగి వైరివర్గంలో చేరడం కూడా పొన్నం ప్రభాకర్‌కు అసహనాన్ని కలిగించింది. వీరందరికి శ్రీధర్‌బాబు అండగా ఉన్నారనే అభిప్రాయం పొన్నం వర్గంలో పాతుకునిపోయింది. శ్రీధర్‌బాబు వర్గీయులు దానిని కొట్టి పారేస్తున్నారు. శ్రీధర్‌బాబు అడపాదడపా ఇక్కడి కార్యక్రమాలకు వస్తున్నా ఇద్దరి మధ్య ఏమాత్రం సయోధ్య ఉండడం లేదు. ఈ ఇద్దరి మంత్రుల వ్యవహారాన్ని ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తలనొప్పిగా భావిస్తున్నారని పార్టీ నేతలు అంటున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ పలు వ్యాఖ్యలు చేసి సస్పెన్షన్ వేటు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఆయన తన పరిస్థితి ఏమిటో పార్టీ స్పష్టం చేయాలని, సస్పెన్షన్ ఎత్తివేస్తుందా లేదా తేల్చాలని పట్టుబడుతున్నారు. ఏర్పాటు కాని ఇందిరమ్మ కమిటీలు కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు కాలేదు. ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసి వాటి ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేసి కలెక్టర్ ఇన్‌చార్జి మంత్రికి పంపి ఆమోదం పొందితేనే నియోజకవర్గంలో ప్రజలకు ఇళ్ల మంజూరు పత్రాలు అందుతాయి. రాష్ట్రవ్యాప్తంగా, జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు ప్రజలకు అందిస్తున్నారు. కరీంనగర్ నియోజకవర్గంలో ఎప్పుడు మంజూరి ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొన్నది. జిల్లాకు వస్తే ఈ పరిస్థితులన్నింటికి సమాధానం చెప్పాల్సి ఉంటుందని, అందకే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లాకు దూరంగా ఉంటున్నారనే ప్రచారం జరుగుతోంది.

# వన మహోత్సవానికి సన్నద్ధం



### ముగింపు దశకు
# ధాన్యం కొనుగోళ్లు



**పెద్దపల్లి-నవభూమి:** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకు న్నాయి. గడిచిన రెండు సీజన్ల కంటే ఈ సీజన్‌లో కొనుగోళ్లు వేగంగా సాగాయి. యాసంగిలో జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా, ఆశించిన మేరకు దిగుబడులు వచ్చాయి. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 812 కోట్ల 36 లక్షల రూపా యల విలువైన 3,51,925 టన్నుల ధాన్యాన్ని 50,108 మంది రైతుల నుంచి కొనుగోలు చేశారు. రెండు యాసంగి సీజన్ల కంటే ఎక్కువ ధాన్యాన్ని కొనుగోలు చేయడం గమనార్హం. ఇంకా 10 వేల నుంచి 15 వేల టన్నుల వరకు ధాన్యం రావొచ్చని పౌరసరఫరాల శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది జూన్ 15వ తేదీ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఈసారి కొనుగోళ్లలో వేగం పెంచారు. 46,648 మంది రైతులకు 727 కోట్ల 62 లక్షల రూపాయలు వారి ఖాతాల్లో జమ చేశారు. అయితే సన్న ధాన్యానికి ఇప్పటి వరకు ఒక్క రైతుకు కూడా ప్రభుత్వం బోనస్ చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ సీజన్‌లో 315 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధి కారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. యాసంగి సీజన్‌లో 2 లక్షల 15 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేయగా, ఇందులో అత్యధికంగా 2 లక్షల ఎక రాల్లో వరి పంటను సాగు చేశారు. 50 వేల ఎకరాలకు పైగా విత్తనోత్పత్తి సాగు చేశారు. ఆడ, మగతోపాటు బ్రీడర్ 2 కోసం వరి సాగు చేశారు. తద్వారా వచ్చే పంట దిగుబడులను ఆయా విత్తన కంపెనీలు రైతుల నుంచి కొనుగోలు చేశారు. కొంత సాధారణ ధాన్యాన్ని రైతులు సీజన్ ఆరంభంలోనే విక్రయించారు. అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసినా కూడా మద్దతు ధరకే ఆ ధాన్యాన్ని కొనుగోలు చేశారు. వేగంగా ధాన్యం కొనుగోళ్లు..ఈ ఏడాది మొదట కాస్త మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు సాగినప్పటికీ కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్, వేణు, డీఎస్‌వో రాజేందర్, సివిల్ సప్లయ్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి చొరవ తీసుకుని కొనుగోళ్లలో వేగం పెంచారు. రైస్‌మిల్లర్ల నుంచి 10 శాతం బ్యాంక్ గ్యారం టీలు తీసుకుని ధాన్యం కేటాయించారు. కాంటా అయిన వెంటనే ఎలాంటి కోతలు లేకుండా రైతులకు వెంట వెంటనే ట్రక్ షీట్లను ఇచ్చారు. మిల్లులకు ఎప్ప టికప్పుడు వాహనాల ద్వారా ధాన్యాన్ని తరలించారు. హమాలీల కొరత ఉన్న చోట బీహార్ కూలీలను పెట్టి కాంటాలు పెట్టారు. ఈ సీజన్‌లో 3,51,925 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డు రకం 2,92,752 టన్నులు, సన్నరకం 59,173 టన్నులు కొనుగోలు చేశారు. 2022-23 యాసంగిలో 3,49,350 టన్నుల ధాన్యాన్ని జూన్ 15వ తేదీ వరకు కొనుగోలు చేశారు. ఇదే సమయానికి 1,85,670 టన్నులు కొను గోలు చేశారు. గతేడాది ఇదే సీజన్‌లో మొత్తం 3,35,616 టన్నుల ధాన్యాన్ని జూన్ 10వ తేదీ వరకు కొనుగోలు చేయగా, ఈ సమయానికి 2,75,826 టన్ను లు కొనుగోలు చేశారు. ఈసారి రోజుకు 15 వేల టన్ను ల వరకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం 145 కేంద్రాలు మూసి వేయగా, 170 కేంద్రాలు తెరిచిఉన్నాయి. ఈ నెలాఖరు వరకు కొనుగోళ్లు ముగుస్తాయని అధికారులు చెబుతున్నారు. బోనస్ డబ్బుల కోసం నిరీక్షణ...రాష్ట్రంలో సన్న రకం ధాన్యం సాగును ప్రోత్సహిం చేందుకు వానాకాలం సీజన్ నుంచి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తున్నది. బోనస్‌ను యాసంగి సీజన్‌కు కూడా ఇస్తామని ప్రకటించడంతో జిల్లాలో 30 వేల ఎకరాలకు పైగా సన్నరకం పంటను సాగు చే శారు. ఇప్పటి వరకు ప్రభుత్వం రైతుల నుంచి 59.173 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యాన్ని కొనుగోలు చేసింది. కానీ ఇంత వరకు బోనస్ డబ్బులు విడుదల చేయక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభు త్వం నుంచి 29 కోట్ల 58 లక్షల 65 వేల రూపాయలు బోనస్ రైతులకు చెల్లించాల్సి ఉంది. గత వానాకాలం సీజన్‌లో ఎక్కువ మొత్తం సన్న రకం పంటను సాగు చేసి ప్రభుత్వానికి విక్రయించడంతో 104 కోట్ల రూపా యల బోనస్ చెల్లించింది. కొనుగోళ్లు ముగుస్తున్నా కూడా ప్రభుత్వం బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. ప్రభుత్వం బోనస్ డబ్బుల గురించి ఏమి మాట్లాడక పోవడంతో ఇస్తారా, ఇవ్వరా అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బోనస్ డబ్బులు చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఆంధ్రజ్యోతి కలెక్టర్ కోయ శ్రీహర్ష ఫోన్‌లో స్పందించగా ప్రభుత్వం నుంచి డబ్బులు రాలేదని తెలిపారు.

## ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి



**కరీంనగర్ -నవభూమి:** రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్ అన్నారు. జిల్లాలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించేందుకు బంగారు రైతు రథాలను సోమవారం గంగాధరలో ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడేళ్ల పాటు కష్టపడితే 30 సంవత్సరాల పాటు రైతులకు నికర ఆదాయం వస్తుందని అన్నారు. ప్రభుత్వం ఈ సాగుకు సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. లోహియా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్‌సాగుపై జిల్లాలో నెలరోజుల పాటు విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. లోహియా కంపెనీ సీఈవో సిద్ధాంత్ లోహియా మాట్లాడుతూ జిల్లాలో విలేజ్ అవుట్ రీచ్ కార్యక్రమంలో భాగంగా ఆయిల్‌పామ్‌పై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామానికి ఈ రథాలు వెళ్లి సదస్సులు నిర్వహిస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ సంస్థ నిర్వాహకులు ప్రతీక్ పట్నాయక్, ఐలయ్య, రోహిత్, మంజువాణి, రవళి, లోహియా సంస్థ జిల్లా మేనేజర్ భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

## పెరిగిన పత్తి విత్తనాల ధరలు

**హుజూరాబాద్,-నవభూమి:** మూడేళ్లుగా చీడ పీడల బెడదతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. మార్కెట్లో పత్తికి ధర ఏడువేలకు మించి పలకకపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారు. పంట దిగుబడి సరిగా రాలేదు. అసలే ఇబ్బందుల్లో ఉన్న పత్తి రైతులపై కేంద్ర ప్రభుత్వం అదనపు భారం మోపింది. ఈసారి పత్తి వ విత్తనాల ధర ప్యాకెట్‌కు 37 రూపాయలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. హుజూరాబాద్ డివిజన్‌లోని జమ్మికుంట, హుజూరాబాద్, వీణవంక, ఇల్లందకుంట, శంకరపట్నం, సైదాపూర్ మండలాలు ఉన్నాయి. 1.2 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా, అందులో 20వేల ఎకరాల్లో బీటీ-2 పత్తి సాగు చేస్తారు. ఈ సారి కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం కంటే ఒక్కో ప్యాకెట్‌పై 37 రూపాయల ధర పెంచింది. 2024 సంవత్సరంలో బీటీ-2 పత్తి విత్తనానికి ఒక ప్యాకెట్‌కు 864 ధర ఉండగా, ప్రస్తుతం 37 రూపాయలు పెంచి 901 రూపాయలుగా నిర్ణయించింది. డివిజన్‌లో 20 వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతుండగా, ఒక ఎకరాకు రెండు పత్తి ప్యాకెట్లు అవసరమవుతాయి. విత్తనాలు పెట్టిన తర్వాత వర్షాలు సమృద్ధిగా కురిస్తే 65 శాతం మాత్రమే మెలకెత్తుతాయి. మళ్లీ పోగుంటలకు పత్తి గింజలు అవసరం ఉంటాయి. మొత్తం 30వేల పత్తి ప్యాకెట్లు హుజూరాబాద్ డివిజన్‌కు అవసరమవుతాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు దుకులు దున్ని భూమిని సిద్ధం చేసుకుంటున్నారు. కొంత మంది రైతులు విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు.లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి.సునీత, ఏడీఏ, హుజూరాబాద్ రైతులు పత్తి విత్తనాలను బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయకుండా లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి. రసీదును జాగ్రత్తగా దాచుకోవాలి. బీటీ-2 పత్తి విత్తనాలు హుజూరాబాద్ డివిజన్‌లో అందుబాటులో ఉన్నాయి. మొదటి వర్షానికే రైతులు విత్తనాలు విత్తి నష్టపోవద్దు. అదును చూసి పత్తి విత్తనాలు వేసుకోవాలి.



# వన మహోత్సవానికి సన్నద్ధం

**జగిత్యాల-నవభూమి:** రాష్ట్రంలో పచ్చదనాన్ని విస్తరింపజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం యేటా మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపడుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారం పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించగా కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం పేరుతో మొక్కలు నాటుతోంది. ఈ ఏడాది జిల్లాలో 49.98 లక్షల మొక్కలు నాటాలని వివిధ ప్రభుత్వ శాఖలకు లక్ష్యాలు కేటాయించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో డీఆర్‌డీఏ, అటవీ శాఖ అధికారుల ఆధ్వర్యంలో జూన్ మొదటి వారంలో మొక్కలు నాటాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. జిల్లాలో అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహోత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందించారు.నర్సరీల్లో మొక్కలు సిద్ధం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఎదురైన అనుభవాలు, తప్పిదాలు పునరావృత్తం కాకుండా అవసరమైన జాగ్రత్తలను అధికారులు తీసుకుంటున్నారు. పదో విడత హరితహారంలో జిల్లాలో 49.98 లక్షల మొక్కలు వివిధ ప్రభుత్వ శాఖలకు లక్ష్యాలు కేటాయించారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, రాయికల్, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో 12 నర్సరీలు, జిల్లాలోని 380 పంచాయతీల్లో అటవీ శాఖ, ఉద్యానవన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలు పెంచారు.ప్రతీ ఇంటికి మొక్కలు పంపిణీ జిల్లాలో పదో విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఇంటికి మొక్కలు ఇచ్చి నాటేందుకు ప్రోత్సహించనున్నారు. ప్రజలు అడిగిన మొక్కలను అందజేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఇళ్లలో ప్రధానంగా పెంచే గులాబీ, మందార, గన్నేరు, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషద మొక్కలు, పూల మొక్కలను సిద్ధం చేస్తున్నారు. పలు మొక్కలను ప్రభుత్వ స్థలాలు,



రహదారులకు ఇరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో నాటేందుకు ప్రణాళిక రూపొందించారు. దీంతో పాటు అటవీ ప్రాంతాల్లో మరింత ఆహ్లాదాన్ని పెంచే విధంగా పలు పూల, పండ్ల మొక్కలను నాటేందుకు సిద్ధమవుతున్నారు.ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యం..జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల వారీగా మొక్కలు నాటే లక్ష్యాన్ని ఉన్నతాధికారులు విధించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 38.43 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం నిర్దేశించారు. వ్యవసాయ శాఖ 1.62 లక్షలు, ఆర్‌అండ్‌బీ 55 వేలు, నీటి పారుదల శాఖ 22 వేలు, రెవెన్యూ 28 వేలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ 7.81 లక్షలు, గృహ నిర్మాణ శాఖ 55 వేలు, విద్యాశాఖ 2 వేలు, పశు సంవర్ధక శాఖ ఒక వెయ్యి, మైన్స్ అండ్ జియోలాజీ 12 వేలు, యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చర్ 5 వేలు, సివిల్ సప్లయి 5 వేలు, ఇతర శాఖలు 1.44 లక్షల మొక్కలు నాటాలన్న లక్ష్యాన్ని విధించారు.వంద శాతం లక్ష్యం సాధిస్తాం రఘువరన్, డీఆర్‌డీవో జిల్లాలో వన మహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యాన్ని వంద సాధించేలా ముందుకు వెళ్తున్నాం. ఇందుకు అనుగుణంగా నర్సరీల్లో మొక్కలు పెంచుతున్నాం. పంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా లక్ష్యం నిర్ణయించుకున్నాం. అన్ని వర్గాల సహకారంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

# ప్రకృతి సేద్యం దిశగా

**సిరిసిల్ల -నవభూమి:** ఆరోగ్యకరమైన పంటలే లక్ష్యంగా, రైతును ప్రకృతి సేద్యం దిశగా ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ మిషన్ అన్ నేచురల్ ఫార్మింగ్ (ఎన్ఎంఎన్ఎఫ్) పథకాన్ని తీసుకవచ్చింది. సహజ వ్యవసాయాన్ని ప్రొత్సహించే దిశగా తీసుకవచ్చిన సేంద్రీయ సాగు ద్వారా భూసారాన్ని పరిరక్షించడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి తోడ్పాటు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన ఈ పథకంలో రైతులను ప్రోత్సహించడానికి రాజన్న సిరిసిల్ల జిల్లాలో కసరత్తు మొదలైంది. రైతులకు శిక్షణ అందించడానికి వ్యవసాయ అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు.జిల్లా వ్యాప్తంగా 700 హెక్టార్లలో సాగు జిల్లాలో నేషనల్ మిషన్ అన్ నేచురల్ ఫార్మింగ్ పథకంలో 14 క్లస్టర్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి క్లస్టర్‌లో 125 మంది చొప్పున రైతులను ఎంపిక చేస్తారు. ఇందుకోసం మొదటి విడతలో ఒక క్లస్టర్‌లో 50 హెక్టార్ల చొప్పున 700 హెక్టార్లలో సాగు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇందుకోసం రైతులను గుర్తించి వారికి శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులను స్వీకరించనున్నారు. సేంద్రియ పంటల సాగు విస్తీర్ణం పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకవచ్చిన కొత్త పథకం ద్వారా జిల్లాలోని 13 మండలాల్లో మొదటగా 14 గ్రామా ల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా శ్రీకారం చుట్టారు. రైతులు ప్రధానంగా సేంద్రియ వ్యవసాయం వల్ల దిగుబడి తగ్గుతుందని చీడ, పీడల ఎక్కువ సోకు తాయనే కారణంగా ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపరు. ఎరువుల వినియోగం, పురుగుల మందు వాడకం లేకపోవడంతో నష్టపోతామనే భావిస్తారు. రైతులు తొలి మూడేళ్లలో దిగుబడి తగ్గినప్పటికీ సాగు వ్యయం కూడా తగ్గి రైతులకు రాబడి పెరుగుతుందనే అవగాహన కల్పించనున్నారు. ఇందుకోసం వ్యవసాయ అధికారులు మట్టి నమూ నాలను కూడా సేకరిస్తున్నారు. సేంద్రియ పంటల సాగు కోసం రైతు లకు ఎకరానికి రూ. 4 వేల ఆర్థిక సహాయం అందిస్తారు. జిల్లాలో సేంద్రియ సాగుపై రైతుల్లోనూ చర్చ మొదలైంది.జిల్లాలో 2.43 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు ముందస్తుగానే రుతు పవనాలు వస్తున్నాయనే వాతావరణ శాఖ ప్రకటనలతో రైతులు వానాకాలం సాగుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.43 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేయనున్నారు. గంభీరావుపేటలో 19,330 ఎకరాలు, ఇల్లంత కుంటలో 38,470 ఎకరాలు, ముస్తాబాద్‌లో 25,250 ఎకరాలు, సిరిసిల్లలో 5,883 ఎకరాలు, తంగళ్లపల్లిలో 22,031 ఎకరాలు, వీర్నపల్లిలో 8,792 ఎకరాలు, ఎల్లారెడ్డిపేటలో 21,130 ఎకరాలు, బోయినపల్లిలో 21,310 ఎకరాలు, చందుర్తిలో 21,610 ఎకరాలు, కోన రావుపేటలో 23,700 ఎకరాలు, రుద్రంగిలో 10,105 ఎకరాలు, వేము లవాడ 10,578 ఎకరాలు, వేములవాడ రూరల్‌లో 15,614 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తున్నారు. ఇందులో వరి 1.84 లక్షల ఎకరాలు, పత్తి 49,760 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పెసర 79 ఎకరాలు, కందు లు 1,155 ఎకరాలు, మొక్కజొన్న 1,600 ఎకరాలు, జొన్నలు 14 ఎక రాలు, ఇతర పంటలు 6,304 ఎకరాల సాగుకు సిద్ధమయ్యారు. ఇందు కోసం జిల్లాలో రైతుల కోసం 56,568 క్వింటాళ్ల వరి విత్తనాలు, పెసర 4.08 క్వింటాళ్లు, మొక్కజొన్న 27.04 క్వింటాళ్లు పత్తి 1,28,650 ప్యాకెట్లు కందులు 122.5 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని సిద్ధం చేశారు. వానాకాలం సాగులో ఎరువులు 56,060 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఇందులో యూరియా 25,370 మెట్రిక్ టన్నులు, డీఏపీ 3,460 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 22,390 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 4,115 మెట్రిక్ టన్నులు ఎస్ఎస్‌పీ 725 మెట్రిక్ టన్నులు అవసరం అవుతాయని అందుకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నారు.



# మావోయిస్టు అధినేతను చంపితే నక్సలిజం పోతుందా..



సుభాష్‌నగర్,-నవభూమి: మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావును తుదముట్టించడం ద్వారా నక్సలిజం పోతుందని బీజేపీ ప్రభుత్వం భ్రమపడడం దురదృష్టకరమని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. సోమవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుంచి పెట్టుబడిదారుల కొమ్ముకాస్తుందని విమర్శించారు. నక్సలిజం మూలాలను చర్చించి పరిష్కరించకుండా ఎన్‌కౌంటర్ పేరుతో హత్య చేయడం సరికాదన్నారు. అనారోగ్యంతో హాస్పిటల్‌కు వెళ్లిన మావోస్టు నంబాల కేశవరావును కాల్చి చంపడం దురదృష్టకరమన్నారు. చట్టరీత్యా కోర్టులు, జైలుకు పంపించకుండా ఎదురు కాల్పుల పేరుతో కేంద్ర ప్రభుత్వం హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై వెంటనే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి దేశ సంపదను కార్పోరేట్ శక్తులకు దారదత్తం చేస్తున్న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో వైఫల్యంతో అతితక్కువ కాలంలోనే ప్రజావ్యతిరేక మూటకట్టుకుందన్నారు. జిల్లా మహాసభల్లో భవిష్యత్ పోరాటాలను రూపొందించుకుంటున్నారు. ఈనెల 27, 28 తేదీల్లో నగరంలోని మధు గార్డెన్‌లో నిర్వహించే 23వ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేన శంకర్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, కొయ్యడ సృజన్‌కుమార్, బోయిని అశోక్, టేకుమల్ల సమ్మయ్య, ఏఐఎస్‌ఎఫ్ కసిరెడ్డి మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కిన్నెర మల్లమ్మ, కటికరెడ్డి బుచ్చన్న, బ్రాహ్మణపల్లి యుగేందర్, బోనగిరి మహేందర్, మచ్చ రమేశ్, కంది రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# రామగుండంలో సర్వీస్ రోడ్ల అభివృద్ధి

గోదావరిఖని, -నవభూమి: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో రూ.25కోట్లతో రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. సోమవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, హెచ్‌కేఆర్, ఆర్అండ్‌బీ, సింగరేణి, పోలీస్ అధికారులతో ఆయన రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్డు పెండింగ్, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించారు. రాజీవ్ రహదారి, పారిశ్రామికంగా ఎంతో కీలకమైందని, పరిశ్రమల అవసరాలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ట్రాఫిక్, భద్రత, వాహనదారుల సౌకర్యార్థం సర్వీస్ రోడ్డు విస్తరణ అవసరమన్నారు. రామ గుండంలో ప్రమాదాల నివారణకు సర్వీస్ రోడ్ల నిర్మాణం, విస్తరణ ఆవశ్య మని, ఇందుకు పరిశ్రమలు సహకరించాలన్నారు. సింగరేణి గెస్ట్‌హౌస్, జీఎం ఆఫీస్‌కార్నర్, బీపవర్‌హౌస్ ప్రాంతాల్లో పరిశ్రమలకు చెందిన ప్రహరీలు వెనక్కి జరిపి సర్వీస్ రోడ్లను విస్తరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. రామగుండం ప్రాంతంలో ట్రాఫిక్ పెరిగిందని, అందుకు అనుగుణంగా రోడ్ల విస్తరణ అవసరమన్నారు. జీఎం ఆఫీస్ జంక్షన్‌ను విస్తరించాలని, లైటింగ్ ఏర్పాట్లు పెంచాలన్నారు. మున్సిపల్ జంక్షన్, బస్టాండ్, ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వంటి ప్రాంతాల్లో హెచ్‌కేఆర్ సంస్థ లైటింగ్ పెంచాలన్నారు. బస్టాండ్ నుంచి మున్సిపల్ జంక్షన్, ఎల్ఐసీ ఆఫీస్ నుంచి గెస్ట్‌హౌస్ వరకు సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉందన్నారు. సింగరేణి జీఎం లలిత్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ హెచ్‌కేఆర్, కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



## రైలులో తీర్థ యాత్రలకు వెళ్దామా..?

# ప్రదేశాలు, ప్యాకేజీల వివరాలివే

పెద్దపల్లి, -నవభూమి: తీర్థ యాత్రలకు వెళ్లే వారికోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం వచ్చే నెల నుంచి 14 నుంచి 22 వరకు, జూలై 5 - 13వ వరకు రెండు ప్యాకేజీలుగా రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను సికింద్రాబాద్/హైదరాబాద్ నుంచి నడపనుంది.గంగా రామాయణ పుణ్య క్షేత్ర యాత్ర ఈ యాత్రలో కాశీ, వారణాసి, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగరాజ్, శృంగవర్పూర్ ప్రాంతాలు దర్శించవచ్చు. ఈ యాత్ర జూన్ 14న ప్రారంభమై 22 వ తేదీ వరకు ఉంటుంది. ఒక్కరికి సాధారణ టికెట్ రూ. 16200, 3 ఏసీ రూ. 26500, 2 ఏసీ రూ. 35000 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి ,విజయనగరం,పలాస,బరంపూర్, భువనేశ్వర్.మీదుగా సాగుతుంది. . ఐదు జ్యోతిర్లింగ యాత్ర ఉజ్జయిని-త్రయంబకేశ్వర్ %-% భీమశంకర్ %-% ఘృష్ణేశ్వర్. ఈ యాత్రలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. ఈ యాత్ర జులై 5న ప్రారంభమై 13వ తేదీ వరకు ఉంటుంది. ఒక్కరికి సాధారణ టికెట్ రూ.14,700, 3 ఏసీ రూ.22,900, 2 ఏసీ రూ.29,900 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్ కామారెడ్డి నిజామాబాద్ ధర్మాబాద్ నాందేడ్, పూర్ణ మీదుగా సాగుతుంది.కల్పించే సౌకర్యాలు..రైలు, బస్సు, హోటల్, భోజనాలు (ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కార్ట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్??, రైల్వే స్టేషన్ నుంచి దేవాలయాలకు ప్రయాణం పూర్తిగ ఉచితం. ప్రతి రైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు కో - ఆర్డినేటర్లు అందుబాటులో ఉండి సౌకర్యాలు సమకురుస్తారు.కోచ్‌కి ఒక



సెక్యూరిటీ గార్డ్?, సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుంది.. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 9701360701, 9281030712, 9281495845, 9281030749, 9281030750 లకు సంప్రదించవచ్చు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. తీర్థ యాత్రలను సద్వినియోగం చేసుకోవాలి : డీఎస్జీపీ కిషోర్, ఐఆర్‌సీటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్, సికింద్రాబాద్.ఐఆర్‌సీటీసీ టూరిజం ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక ప్యాకేజీల కింద రైలులో తీర్థ యాత్రలు చేసేందుకు వీలు కల్పించింది. మొదటి ప్యాకేజీ గంగా రామాయణ పుణ్య క్షేత్ర యాత్ర తీర్థ యాత్ర వచ్చే నెల 14న సికింద్రాబాద్ నుంచి ప్రారంభం. రెండో ప్యాకేజీ తీర్థయాత్ర ఐదు జ్యోతిర్లింగ యాత్ర జూలై 5న ప్రారంభం కానుంది. అన్ని సౌకర్యాలతో తీర్థయాత్రలను సురక్షితంగా చేయవచ్చు. రైలు ద్వారా తీర్థయాత్రలు చేసేందుకు రైల్వే శాఖ అందుబాటులోకి తీసుకవచ్చిన రెండు ప్రత్యేక ప్యాకేజీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

# పథకం ప్రకారమే దాడి

సిరిసిల్ల -నవభూమి: రాష్ట్రంలో ప్రజా పాలన కాదు, రాక్షస పాలన సాగుతున్నదని, కాంగ్రెస్ గూండాలు పథకం ప్రకారమే దాడి చేశారని బీఆర్ఎస్ సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య నిప్పులు చెరిగారు. కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి చేసేందుకు బరితెగించిన కాంగ్రెస్ నాయకులను అదుపు చేయాల్సిన పోలీసులు లాఠీచార్జి పేరిట బీఆర్ఎస్ శ్రేణులను విచక్షణారహితంగా చితకబాదారని ఆరోపించారు. బీఆర్ఎస్ శ్రేణులను చావబాదుతరా..? అని ప్రశ్నించారు. దీనికి తప్పకుండా బదులు ఉంటదని హెచ్చరించారు. ఘటనను ఖండిస్తూ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం పోలీసుల లాఠీచార్జిలో గాయపడ్డ బీఆర్ఎస్ కార్యకర్తలను తంగళ్లపల్లి ఠాణాకు వెళ్లి పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆ తర్వాత సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనూ విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అంటే నియోజకవర్గంలోని ప్రజలకు సేవలందించే కార్యాలయమని పేర్కొన్నారు.కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నట్లుగా వారి మాదిరిగా ఇక్కడ తాము చిల్లర మల్లర కార్యక్రమాలు చేయడం లేదని చెప్పారు. అందరినీ ఆదరించే తత్వం తమదని, పేదోళ్లు, అభాగ్యులు, నిర్భాగ్యులను ఆదరించే కేంద్రం క్యాంపు కార్యాలయమని వివరించారు. కాంగ్రెస్ గూండాలు పథకం ప్రకారమే దాడి చేశారని, ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియాలో పోస్టు చేసినప్పుడే పోలీసులకు తాము సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీస్తే ఊరుకోబోమని ముందే చెప్పామన్నారు. క్యాంప్ కార్యాలయం ప్రభుత్వానికి సంబంధించినదని, దానిని కాపాడుతామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామని, ఆ బాధ్యత చూసుకుంటానని పట్టణ సీఐ కృష్ణ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. కానీ పోలీసులు ఈ రోజు పక్షపాతంగా వ్యవహరించారని, కాంగ్రెస్ ఆఫీస్ నుంచి ఆ పార్టీ గూండాలను సాదరంగా తీసుకుని వచ్చి దాడి చేయించినట్లుగా వ్యవహరించారని ఆరోపించారు.ఇరవై ఏండ్లుగా ప్రజలు ఓడిస్తూ, ముఖంపై ఉమ్మేసినా కేకే మహేందర్‌రెడ్డి సిగ్గు ఎగ్గులేకుండా పార్టీ నాయకులను బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు ఉసిగొల్పుతున్నాండంటూ ఆగయ్య ఫైర్ అయ్యారు. కచ్చితంగా దీనికి బదులు ఉంటుందని హెచ్చరించారు. తాము పదేండ్లలో అధికారంలో ఉన్నామని, ఇలా ఎప్పుడూ వ్యవహరించలేదన్నారు. ప్రజలందరికీ సేవలందించే కార్యాలయంలో రేవంత్‌రెడ్డి లాంటి దొంగలు, బ్యాగులు మోసి వచ్చినోడి ఫొటో ఎందుకు పెడుతామని ప్రశ్నించారు. తెలంగాణ సాధించి కేసీఆర్, సిరిసిల్లను ప్రగతిలో నిలిపి కేటీఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, ఏం చేసినా చెరిపేయలేవ్..? అంటూ రేవంత్‌రెడ్డికి కౌంటర్ ఇచ్చారు.కాంగ్రెస్ అల్లరి మూకలు, గూండాలు ప్రజల చేతుల్లో శిక్షించబడే రోజులు ముందున్నాయని, త్వరలోనే ఆ పార్టీకి రాష్ట్రంలో నూకలు చెల్లుతాయని చెప్పారు. అదుపులోకి తీసుకున్న తమ పార్టీ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే క్యాంపు కార్యాలయంపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయాచోట్ల ఆయన వెంట నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, బొల్లి రామ్మోహన్, దిడ్డి రాజు, మాట్ల మధు, చిరంజీవి, అమర్‌రావు, నందగిరి భాస్కర్‌గౌడ్, పార్టీ నేతలు ఉన్నారు.



## శిక్షణ అంశాలను పాఠశాలలో అమలుచేయాలి



**సుల్తానాబాద్, -నవభూమి:** విద్యార్థులు అన్ని సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యా?ధికారి మాధవి అన్నారు. గర్రెపల్లి జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న జీవశాస్త్రం ఉపాధ్యా యుల రెండో దశ ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభిం చారు. అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి డీఈవో మాట్లాడుతు శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నేర్చుకున్న ప్రతీ అంశాన్ని పాఠశాలల్లో అమలు చేయాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పిల్లల్లో అభ్యసనా ఆసక్తిని మెరుగుపరుచాలన్నారు. జిల్లాలోని ఏడు మండలాలకు చెందిన ఉపాధ్యాయుతోపాటు కోర్స్ డైరెక్టర్ కవిత, రిసోర్స్‌పర్సన్ నరేష్, కుమార్, సాధన, ప్రత్యక్ష, సీఆర్పీలు కిరణ్, రిజయా తదితరులు ఉన్నారు.

## నెల క్రితమే దుబాయ్‌కు కూలీ పనికి చందు.. అంతలోనే విగతజీవిగా స్వగ్రామానికి



**చిగురుమామిడి, -నవభూమి:** చిగురుమామిడి మండలంలోని ఓగులాపూర్ గ్రామానికి చెందిన బూడిద చందు (22) నెల రోజుల క్రితం దుబాయ్‌కు బ్రతుకుతెరువు కోసం కూలి పనికి వెళ్లాడు. వారం రోజుల క్రితం తీవ్రమైన కడుపునొప్పి రావడంతో దుబాయిలోనీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందాడు. వారం రోజుల అనంతరం మృతదేహం స్వగ్రామం ఓగులాపూర్‌కు సోమవారం రావడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.చేతికి అందిన కొడుకు విగత జీవిగా తిరిగి రావడంతో తల్లిదండ్రులు ఎల్లయ్య, కవితలు బోరున విలపించారు. ఎలాంటి ఆస్తిపాస్తులు, భూములు లేని చందు బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి నెల రోజుల్లోనే మృత్యువాత పడడం గ్రామస్తులను కలిచివేసింది. సోమవారం మృతుడు చందు అంతక్రియలు నిర్వహించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ బోయిని శ్రీనివాస్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ ప్రభుత్వాన్ని కోరారు.

## నిరుపయోగంగా ఎరువుల గోదాం.. లక్షల రూపాయలు వృధా

**కొడిమ్యాల, -నవభూమి:** కొడిమ్యాల మండలంలోని పూడూర్ గ్రామంలో ఇండియన్ బ్యాంక్ వెనకాల పూడూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల క్రితం 500 మెట్రిక్ టన్నుల గోదాంను నిర్మించారు. నాబార్డ్ నిధులు రూ.38 లక్షలు, సహకార సంఘం నిధులు రూ.3 లక్షలతో గోదాంను నిర్మించారు.అయితే రైతుల కోసం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన గోదాం నిరుపయోగంగా మారింది. ఈ నేపథ్యంలో భారీ వ్యయంతో నిర్మించి వృధాగా మారిపోయిన గోదాంను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై సహకార సంఘం సీఈఓ రాజేందర్‌ను వివరణ కోరగా.. గోదాం ముందు ట్రాన్స్‌ఫార్మర్ ఉందని దానిని తొలగించిన తర్వాత వినియోగించనున్నట్టు తెలిపారు.



# కాంగ్రెస్ దౌర్జన్యకాండ!

**సిరిసిల్ల-నవభూమి:** సిరిసిల్ల ఉలిక్కిపడింది. కాంగ్రెస్ నాయకుల రాడీయిజంతో వణికిపోయింది. ప్రజాపాలన అంటూ కొద్దిరోజులుగా దౌర్జన్యం చేస్తున్న హస్తంముఠా, సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడికి యత్నించింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ఆ పార్టీ కార్యకర్తలు గుండాల్లా రెచ్చిపోగా, బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. గులాబీ శ్రేణులను చావబాదారు. పలువురికి తీవ్ర గాయాలు కాగా, పార్టీ పట్టణాధ్యక్షుడు చక్రపాణి చేయి విరగ్గొట్టారు. ఖాకీల దాష్టీకంపై బీఆర్ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోయారు. సోమవారం సిరిసిల్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడికి సిద్ధమయ్యారు. వారిని వారించేందుకు యత్నించిన బీఆర్ఎస్ నేత ఇన్నోవా కారుపై దాడి చేసి కారు అద్దాలను ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా అడ్డుకునే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై వీరంగం సృష్టించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జి చేయడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. అధికార పార్టీ కార్యకర్తలను వదిలి బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు విచక్షణారహితంగా చితకబాదారంటూ పార్టీ నేతలు వాపోయారు.లాఠీలతో చితక్కొట్టి, బూట్లతో తన్ని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారంటూ ఆరోపించారు. గాయపడ్డారన్న కనికరం చూపకుండా ఠాణాకు తీసుకెళ్లి నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. లాఠీచార్జిలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి చేయి విరిగిపోగా, బొల్లి రామ్మోహన్, సబ్బని హరీశ్, గడ్డం భాస్కర్, బింగి ఇజ్జగిరి, చంటి, కోడూరి భాస్కర్‌గౌడ్, తదితర నాయకులు దాదాపు 15మంది వరకు గాయాలపాలయ్యారు. గాయపడిన నాయకులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పరామర్శించారు. లాఠీచార్జిని తీవ్రంగా ఖండించారు. కార్యకర్తలపై జరిగిన దాడిని తెలుసుకుని జిల్లా నలుమూలల నుంచి పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సిరిసిల్లకు తరలివచ్చారు.హేయమైన చర్య సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో పెట్టాలని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య జరిగిన తోపులాటలో బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. కాంగ్రెస్ నాయకులు గిచ్చి కయ్యం పెట్టుకున్నారు. సిరిసిల్లలో ఉన్న కేటీఆర్ క్యాంపు ఆఫీస్ ఎమ్మెల్యే కార్యాలయం కాదు. అది కేవలం ఎమ్మెల్యే కోసం నిర్మించుకున్న గృహం. శాసనసభ్యులు నిర్మించుకున్న ఇంటిలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఎలా పెడతారో చెప్పాలి. బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేయడం హేయమైన చర్య.వినోద్‌కుమార్, మాజీ ఎంపీ రౌడీ రాజ్యంలా రేవంత్ పాలన ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. పొలిటికల్ డైవర్షన్‌తో ప్రజల దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తున్నది. రేవంత్‌రెడ్డి పాలన రౌడీ రాజ్యాన్ని తలపిస్తున్నది. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నది. కాంగ్రెస్ నేతలకు పాలన చేతకాక డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నరు. ఒక అడుగుముందుకేసి దాడులకు పాల్పడుతున్నరు. కేటీఆర్ క్యాంపు కార్యాలయం మీద దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను నేనొక్కటే ప్రశ్నిస్తున్నా. మీ పార్టీ నేత రాహుల్‌గాంధీ క్యాంపు ఆఫీస్‌తోపాటు కాంగ్రెస్ ఎంపీ ఆఫీసుల్లో ప్రధాని మోదీ ఫొటో ఉందా..? చెప్పాలి. దాడికి యత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలి. బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసులు అత్యుత్సాహం చూపి చితకబాదడం సరికాదు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలి.సుంకె రవిశంకర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే ప్రజాపాలనలో ప్రొటోకాల్ ఉల్లంఘన రాష్ట్రంలో దౌర్జన్య పాలన కొనసాగుతున్నది. కాంగ్రెస్ ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నది. గతంలో 20 ఏండ్లు వెనుకబడిన సిరిసిల్లను కేవలం ఎనిమిదేండ్లలోనే అభివృద్ధి చేసిన గొప్ప వ్యక్తి కేటీఆర్. ఆయన చొరవతో టెక్స్‌టైల్ పార్కులో వేల మందికి ఉపాధినిచ్చేలా ఏర్పాటైన పరిశ్రమ ప్రారంభోత్సవంలోనూ కేటీఆర్ ఫొటో పెట్టలేదు. గతంలో ఐదు సార్లు ఓడిన కేకే మహేందర్‌రెడ్డి, పద్మశాలి సామాజిక వర్గాన్ని కించపరిచే విధంగా



మాట్లాడిండు. సిరిసిల్ల ప్రజలు అతనికి ఓట్లు వేయలేదన్న అక్కసుతో సిరిసిల్లను కుక్కలు చింపిన విస్తరి చేయాలని చూస్తున్నడు. ఈ ప్రాంతానికి చెందిన కొంత మందిని అడ్డుపెట్టుకుని రౌడీ రాజ్యం చేస్తున్నడు. ప్రొటోకాల్ పాటించాలని మేము ఎస్పీకి కలిసి వినతిపత్రం ఇచ్చి శాంతియుతంగా ఉంటే, కేకే మహేందర్‌రెడ్డి తొత్తులు కొంతమంది రేవంత్‌రెడ్డి ఫొటో క్యాంపు కార్యాలయంలో పెడతామని రెచ్చగొడుతూ మీడియా ముఖంగా చెప్పారు. ముందస్తుగా సమాచారం ఉన్నప్పటికీ పోలీసులు కావాలనే కాంగ్రెస్ నేతలు క్యాంపు కార్యాలయానికి వచ్చేలా చేశారు. క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న మమ్మల్ని అక్కడి నుంచి పంపించి వేసి కాంగ్రెస్ నేతలను మంగళహారతులు ఇచ్చి ఆహ్వానించిన చందంగా వ్యవహరించారు. క్యాంపు కార్యాలయం వద్దకు కాంగ్రెస్ నేతలు రావడాన్ని గమనించి నేను అక్కడికి వెళ్లా. నా వాహనం అద్దాలను వారు ధ్వంసం చేస్తే, వారిని వదిలి మా పార్టీ నాయకులపై లాఠీచార్జి చేయడం ఎంతవరకు సమంజసం? ఈ విషయంపై సీఎస్‌తో పాటు ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తా. జిందం చక్రపాణి, బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడుతప్పు చేసినోళ్లను వదిలి అడ్డుకున్నోళ్లను కొడతరా..? బీఆర్ఎస్ కరీంనగర్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ 'సిరిసిల్లలో ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ గూండాలను అడ్డుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేయడం దారుణం. తప్పు చేసినోళ్లను వదిలి అడ్డుకున్నోళ్లను కొడుతరా..? ఇదేం పద్ధతి?' అని పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు గూండాల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. క్యాంపు కార్యాలయంపై దాడి చేయాల్సినంత అవసరం ఏముందని ప్రశ్నించారు.పోలీసుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని గతంలోనూ సిద్దిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడిచేసిన విషయాన్ని గుర్తు చేశారు. నేషనల్ హెరాల్డ్ కేసు చార్జ్ షీట్‌లో రేవంత్‌రెడ్డి పేరు చేర్చడం, నిర్వాహకుల తీరుతో మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ పోటీ నుంచి తప్పుకోవడం లాంటి ఘటనల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఇలాంటి ఉద్దేశపూర్వక దాడులకు ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాలపై దాడులు చేయలేదని చెప్పారు.ఈ సంస్కృతి సరికాదని, ఇప్పటికైనా తీరుమార్చుకోవాలని సూచించారు. శిశుపాలుడు అహంకారంతో విర్రవీగుతూ తనకు తిరుగులేదని తప్పుమీద తప్పు చేసుకుంటూ పోయినట్టుగా.. రేవంత్‌రెడ్డి సైతం అధికారం రాగానే తనకు ఇష్టం వచ్చినట్టుగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు చేసే ప్రతి తప్పునూ రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. ఇప్పటికైనా కాంగ్రెస్ తమ వక్రబుద్ధి మానుకొని ప్రజలకు సేవ చేయడం మీద దృష్టి పెడితే బాగుంటుందని హితవుపలికారు.

## జేఈఈ మెయిన్స్‌లో ట్రినిటీ విద్యార్థుల ప్రతిభ

**కరీంనగర్ -నవభూమి:** జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో బీ ఆర్చ్, బీ ప్లానింగ్‌లో కరీంనగర్‌లోని ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. బీ ప్లానింగ్ విభాగంలో బీ హితేశ్ 152వ ర్యాంకు, డీ మహేశ్ 227, బీ రేణుక 393, ఏ శరణ్యనందిని 737, ఎం నిఖిత్‌నాయక్ 1031, వీ లత 1092, జీ అజయ్ 1115, ఆర్ ఐశ్వర్య 1272, ఎం అంజనశ్రీ 1388 ర్యాంకు సాధించారు. బీ-ఆర్చ్‌లో బీ హితేశ్ 718, డీ మహేశ్ 756, బీ రేణుక 1208, ఆర్ ఐశ్వర్య 1877, ఏ శరణ్యనందిని 1855 సాధించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకునేందుకు నిర్దిష్టమైన ప్రణాళిక, నిరంతర శ్రమ అవసరమని తెలిపారు. వాటితోపాటు క్రమశిక్షణతో విద్యను అందించడం ద్వారా ఈ విజయాలు సాధించినట్లు తెలిపారు.ఈ విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యార్థులు సాధించిన ర్యాంకులు ట్రినిటి విద్యా సంస్థల్లో ఉన్నతమైన విద్యా బోధనకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. భవిష్యత్తులో వారు ఎంచుకున్న రంగాల్లో రాణించి తమ తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తుంది.. బకాయిల చెల్లింపులపై మాజీ సర్పంచ్ కరుణాకర్



**హుజూరాబాద్ -నవభూమి:** తమ బిల్లులు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తుందని రంగాపూర్ మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి మాజీ సర్పంచులు వెళ్తున్నారనే సమాచారంతో హుజూరాబాద్, ఇల్లంతకుంట మండలానికి చెందిన మాజీ సర్పంచులను తెల్లవారుజామున హైదరాబాద్ కు వెళ్లకుండా పోలీసులు అడ్డుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రోజుల క్రితం గ్రామపంచాయతీ బిల్లులు రూ.153 కోట్లు, ఎస్టీఎఫ్ గ్రాంట్ రూ.85 కోట్లు చెల్లించినట్టు ప్రగల్భాలు పలికిందన్నారు. సర్పంచుల బిల్లులు చెల్లిస్తే ముందస్తు అరెస్టులు ఎందుకు అని ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శులు చేసిన చిన్న చిన్న పనులకు బిల్లు చెల్లించిందని, వాటిని సర్పంచులకు చెల్లించినట్టు ప్రచారం చేసుకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి చెల్లించకపోగా అరెస్టులతో మాజీ సర్పంచులను మానసికంగా, ఆర్థికంగా కుంగ తీసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వంలో చేసిన పనులకు కమిషన్లు తీసుకొని పెద్ద పెద్ద కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించిందని అన్నారు. కిందిస్థాయిలో జరిగిన అభివృద్ధి పనుల బిల్లులను చెల్లించడంలో ప్రభుత్వం తీవ్రంగా జాప్యం చేస్తుందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన పనులకు మాత్రమే బిల్లులు చెల్లించారని ఆరోపించారు. అరెస్టైన వారిలో హుజూరాబాద్ మండలానికి చెందిన మాజీ సర్పంచులు చేరాల మనోహర్, లక్ష్మారెడ్డి, తిరుపతి, కిరణ్, ఇల్లంతకుంట మాజీ సర్పంచులు తిప్పారపు మొగిలి,కంది దిలీప్ రెడ్డి, మూడెత్తుల వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

# పెగడపల్లిలో ముగిసిన రాజీవ్ యువ వికాసం ఇంటర్వ్యూలు

**జగిత్యాల-నవభూమి:** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికకుగాను దరఖాస్తుదారులకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు మంగళవారంతో ముగిసాయి. మండలంలో రాజీవ్ వికాసం పథకానికి 2090 దరఖాస్తులు రాగా.. కేటగిరీల వారిగా నాలుగు రోజులపాటు ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దరఖాస్తుదారులకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను ఒక్కొక్కరిగా వారు ఎంచుకున్న యూనిట్, నిర్వహణ, యూనిట్ ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాల వంటి వివరాలను ఇంటర్వ్యూలో అధికారులు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 1705 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్, సెర్ప్ ఏపీఎం సమత, టైపిస్టు తిరుపతి, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రధాన రహదారిపై గుంత.. నెల రోజులైనా పూడ్చడం లేదు



**కోరుట్ల,-నవభూమి:** కోరుట్ల పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై గుంతను తవ్వి నెల రోజులు గడిచినా దాన్ని పూడ్చడం మాత్రం మర్చిపోయారు. పట్టణంలోని వేములవాడ రోడ్డులో నెల రోజుల క్రితం మిషన్ భగీరథ పైప్ లైన్ దెబ్బ తినడంతో వాటర్ లీకేజీ జరిగింది. రహదారి మధ్యలో మరమ్మతు పనుల కోసం పెద్ద గుంతను తవ్వారు. మరమ్మతులు చేసిన తర్వాత పూడ్చి వేయాల్సిన గుంతను నిర్లక్ష్యంగా వదిలేశారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిపై పెద్ద గుంత ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రహదారి మధ్యలో ఉన్న గుంతకు ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేయడంతో రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి గుంతను పూడ్చివేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

# జూన్‌లో లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల అప్పగింత : ఎమ్మెల్యే విజయరమణారావు



**పెద్దపల్లి -నవభూమి:** పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని చందపల్లి, హనుమంతుని పేట శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను జూన్ నెలలో మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నట్లు పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ విజయ రమణారావు తెలిపారు. మంగళవారం చందపల్లె హనుమంతుని పేట గ్రామ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో రోడ్లు, త్రాగునీటి వసతి విద్యుత్తు సౌకర్యం లాంటి మౌలిక సౌకర్యాలు ఏ విధంగా ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి లబ్ధిదారుని పేరు మీద విద్యుత్ మీటర్ తీసుకోవడంతోపాటు జూన్ మాసంలో మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా గృహప్రవేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల గృహప్రవేశానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఏఈ సతీష్, మాజీ కౌన్సిలర్లు బూతగడ్డ సంపత్, నూగిళ్ల మల్లయ్య, నెట్టెట్లా స్వరూప కొమురయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భూషణ వేణి సురేష్ గౌడ్, నాయకులు బొడ్డుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ.. జూన్ నుంచి నిర్వహణ



**సుల్తానాబాద్ -నవభూమి:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి రంగాలకు సంబంధించిన నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సిహెచ్ గిరిజ అన్నారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గరేపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ గిరిజ మాట్లాడుతూ.. పదవ తరగతి, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు, ప్రస్తుతం ఫైనల్ ఇయర్ చదువుతున్న గురుకుల విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు. ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో యుఎన్ ఎక్స్ట్ సంస్థ ఆధ్వర్యంలో 90 గంటలు తరగతి గదిలో ప్రత్యక్షంగా, 75 గంటలు సెల్ఫ్ లర్నింగ్ విధానంలో శిక్షణ ఉంటుందన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, లైవ్ స్కిల్స్, జీవన నైపుణ్యాలు, హెచ్‌ఆర్ సంబంధిత విషయాల్లో స్కిల్స్, ఇంటర్వ్యూ అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. జూన్ మూడో వారం నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల పూర్వ విద్యార్థులు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను కలిసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఈ శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలి : కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సురేంద్ర కుమార్

**జగిత్యాల, -నవభూమి:** జగిత్యాల జిల్లాలో ఫుడ్ డెలివరీ, హోమ్ సర్వీసెస్, కొరియర్ సర్వీసెస్, ఏసీ టెక్నిషియన్స్, గ్రాఫిక్ డిజైనర్స్, వీడియో ఎడిటర్స్, ఉబర్, ఓలా, రాపిడో, స్విగ్గి. జోమోటో, జెప్టో, అర్బన్ కంపెనీ మొదలగు ఆన్‌లైన్ ప్లాట్ ఫాంలలో విధులు చేసేవారు తప్పనిసరిగా ఈ-శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ సురేంద్రకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ పేరు నమోదు చేసుకున్న కార్మికులకు ప్రభుత్వం అమలు చేసే సాంఘిక సంక్షేమ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. దీనికిగాను తమ మొబైల్ నంబర్, ఆధార్ కార్డు, పాన్ కార్డు ద్వారా సొంతంగా గానీ, సీఎస్సీ సెంటర్లలోగానీ తమ పేరు నమోదు చేసుకొని యూనిక్ గుర్తింపు కార్డు పొందగలరని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో గిగా వర్కర్స్ కు సంక్షేమ పథకాలు అమలు చేయాలని నిర్ణయించింది. దీనికిగాను ఈ శ్రమ్ పోర్టల్ లో నమోదు చేసుకోవాలని సూచించారు.




# సైబర్ క్రైమ్ నేరాలపై భక్తులకు అవగాహన కల్పించిన పోలీసులు



**వేములవాడ -నవభూమి:** రాజన్న సన్నిధికి వచ్చే భక్తులను సిరిసిల్ల జిల్లా పోలీసులు సైబర్ క్రైమ్ నేరాల పట్ల అప్రమత్తం చేస్తున్నారు. మంగళవారం వేములవాడ రాజన్న ఆలయ పరిసరాల్లో భక్తులకు సైబర్ నేరాల పట్ల జిల్లా సైబర్ క్రైమ్ పోలీసుల బృందం రాజు, శ్రీకాంత్ బ్లూ కోట్ పోలీసులతో కలిసి అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తుల నంబర్ల నుండి బహుమతులు వచ్చాయని, నగదు ప్రైజ్ మనీ గెలుచుకున్నారని ఇలా అనేక రకాలుగా మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపి ఆర్థిక నేరాలకు పాల్పడే అవకాశం ఉందని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా మీరు ఎంపికయ్యారని సంబంధిత వివరాలు తెలపాలని కూడా మోసానికి పాల్పడుతున్నట్లు వివరించారు. ఇలా ఎవరైనా గుర్తు తెలియని నెంబర్ల ద్వారా ఫోన్‌కు సందేశాలు వస్తే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మన వ్యక్తిగత సమాచారం, బ్యాంకు లావాదేవీలను ఎట్టి పరిస్థితులలోనూ ఎవరికి చెప్పొద్దన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని భక్తులకు సూచించారు.

# కరీంనగర్‌లో మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టులు



**కరీంనగర్ -నవభూమి:** పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ముఖ్యమంత్రి ఇంటి ముట్టడికి పిలుపునిచ్చిన మాజీ సర్పంచులను పోలీసులు అరెస్ట్ చేశారు. సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ వెళ్లేందుకు ప్రయత్నించిన మాజీ సర్పంచులను కరీంనగర్ జిల్లాలో ఎక్కడికి అక్కడ ముందస్తుగా అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్నదని ఆరోపించారు. అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేస్తే బిల్లులు విడుదల చేయాలని కోరడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# ఇండ్ల కేటాయింపులో పేదలకు అన్యాయం

**కరీంనగర్, -నవభూమి:** కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల పేరిట పేదలను నమ్మించి ముంచిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కొప్పుల విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అర్హులైన పేదలకు అన్యాయం జరిగిందని ఆవేదన చెందారు. దళితబంధు తీసుకున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం లేదని, ఇదేనా పథకం అమలు చేసే పద్ధతి అని నిలదీశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని, త్వరగా నిర్మించుకోవాలని నిరుపేదలకు చెబితే నమ్మి ఉన్న ఇంటిని కూల్చుకున్నారని, తీరా జాబితాలో పేర్లు లేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని వాపోయారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇందిరమ్మ ఇండ్లను తమ పార్టీ కార్యకర్తలకు ఇస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో మొదటి ఏడాది 4.16 లక్షల మందికి ఇండ్లు కట్టిస్తామని చెప్పిన ప్రభుత్వం, అంతంతే మంజూరు చేసినందని పేర్కొన్నారు. ప్రజా పాలనలో ఇండ్ల కోసం 77.18 లక్షల దరఖాస్తులు వచ్చాయని, పరిశీలించిన ప్రభుత్వం.